క్లుప్తంగా

ఉచిత టైలరింగ్ శిక్షణ

తంబళ్లపల్లె: స్థానిక టీఎస్ సుబ్బారెడ్డి మెమోరియల్ ప్రభుత్వ ఐటీఐలో స్కిల్‌హబ్ ఆధ్వర్యంలో ఉచిత టైలరింగ్ శిక్షణ ఇచ్చి ఉపాధి అవకాశాలు కల్పించనున్నట్లు ప్రిన్సిపాల్ రవీంద్రరెడ్డి తెలిపారు. ఈ శిక్షణ మూడు నెలల పాటు ఉచితంగా ఇవ్వడం జరుగుతుందన్నారు. ఆసక్తి కలిగిన యువతీ, యువకులు ఈ నెల 28వ తేదీలోపు పేర్లు రిజిస్టర్ నమోదు చేసుకోవాలన్నారు. మరిన్ని వివరాలకు స్కిల్‌హబ్ కోఆర్డినేటర్ చౌడయ్య సెల్‌నెం.9618655759ను సంప్రదించాలన్నారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

మదనపల్లె సిటీ: రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి తీవ్రంగా గాయపడిన సంఘటన మదనపల్లె మండలంలో సోమవారం జరిగింది. పోలీసుల కథనం మేరకు మదనపల్లె పట్టణం ఈశ్వరమ్మ కాలనీకి చెందిన నూరుల్లా(36) సొంత పనిమీద ద్విచక్రవాహనంలో వాల్మీకిపురం వెళ్లాడు. తిరిగి మదనపల్లెకు వస్తుండగా ఆరోగ్యవరం వద్ద గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్రంగా గాయపడ్డారు. అతడిని మదనపల్లెలోని ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు.

అన్నం ప్యాకెట్లు పంపిణీ

మదనపల్లె సిటీ: స్థానిక ఆర్టీసీ బస్టాండు వద్ద నున్న యాచకులకు మహాకార్య ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు పూర్ణిమ అన్నం ప్యాకెట్లు పంపిణీ చేశారు. బస్టాండు వద్ద పలువురు ఇబ్బందులు పడుతుండటం చూసి అన్నం ప్యాకెట్లు అందజేసినట్లు తెలిపారు.

కర్ణాటక మద్యం ప్యాకెట్ల పట్టివేత

పెద్దతిప్పసముద్రం: మండలంలోని టి.సదుం సమీపంలోని అంకాలమడుగు చెక్‌పోస్టు వద్ద ఎస్‌ఐ రవీంద్రబాబు సోమవారం సిబ్బందితో కలసి నాకాబందీ నిర్వహించారు. ఈ నేపథ్యంలో సత్యసాయి జిల్లా కదిరికి చెందిన గోవర్దన్ (26) కర్ణాటక నుంచి 48 ప్యాకెట్ల మద్యం ప్యాకెట్లను అక్రమంగా తరలిస్తూ పట్టుబడ్డాడు. అతడిపై కేసు నమోదు చేసి రిమాండ్‌కు పంపామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

21న మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యవర్గ సమావేశం

పెద్దతిప్పసముద్రం: తాడేపల్లిలో ఈ నెల 21న వైఎస్సార్‌సీపీ మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వస్తున్నట్లు మైనార్టీ సెల్ విభాగం రాష్ట్ర కార్యదర్శి రియాసత్ అలీఖాన్ సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీ ప్రధాన కార్యదర్శి సజ్జల రామక్రిష్ణారెడ్డి, మైనార్టీ విభాగం రాష్ట్ర కార్యదర్శి ఖాదర్‌బాషా అధ్యక్షతన జరిగే సమావేశంలో మైనార్టీ విభాగం చేపట్టవలసిన కార్యాచరణపై చర్చిస్తారన్నారు. ఈ మేరకు తనకు పార్టీ కేంద్ర కార్యాలయం నుంచి ఆహ్వానం అందిందని రియాసత్ పేర్కొన్నారు.

ఈ -క్రాప్ నమోదు చేసుకోండి

నిమ్మనపల్లె: రబీ సీజన్లో వివిధ రకాల పంటలు సాగు చేసిన మండలంలోని రైతులు ఈ క్రాప్ లో పంట నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయ అధికారి మురళి మోహన్ తెలిపారు. సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడుతూ మండలం లోని 12 సచివాలయాల పరిధిలో రబీ సీజన్ కు గాను 1265 ఎకరాల్లో సాగుచేసిన పంటను 846 మంది రైతులు నమోదు చేసుకున్నారన్నారు. మిగిలిన రైతులు ఈనెల 23వ తేదీలోగా సంబంధిత రైతు భరోసా కేంద్రాలలో పంట నమోదు ప్రక్రియను పూర్తి చేసుకోవాలన్నారు. ఈ క్రాప్ బుకింగ్ ఆధారంగానే ప్రభుత్వ రాయితీలు అందజేయడం జరుగుతుందన్నారు. రైతులు అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

సారా తయారీకి దూరంగా ఉండాలి

-సీఐ సూర్యనారాయణ

బి.కొత్తకోట: నాటుసారా తయారీ, విక్రయాలకు, కర్ణాటక మద్యం అక్రమంగా తరలింపునకు దూరంగా ఉండాలని సీఐ సూర్యనారాయణ కోరారు. సోమవారం మండలంలోని అటవీ సరిహద్దు గ్రామాలైన మొటుకుపల్లె, పులుసుమానిపెంట, అరిమానిపెంట, చిన్నపల్లె, నాయనబావి పంచాయతీల్లో పర్యటించారు. గ్రామస్తులను కలిసి వారితో ఎన్నికల దృష్ట్యా పోలీసులకు సహకరించాలని కోరారు. చట్ట విరుద్ధమైన పనులు, కార్యక్రమాలకు దూరంగా ఉండాలని, గ్రామాల్లో ప్రశాంత వాతావరణ నెలకొనేలా అందరు సహకరించాలన్నారు. ఈ గ్రామాలకు కర్ణాటకకు సరిహద్దులో ఉండటంతో అక్కడినుంచి మద్యం అక్రమంగా తరలించే వారిపై నిఘా ఉంచి ఎప్పటికప్పుడు సమాచారం ఇవ్వాలని కోరారు. ఎన్నికల్లో గొడవలు సృష్టించే వీలున్న అనుమానితులపై నిఘా ఉంచుతామని సీఐ గ్రామస్తులకు వివరించారు.

నేడు ఎమ్మెల్యే పర్యటన

కలకడ : కలకడ మండలంలో మంగళవారం ఉదయం ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి పర్యటిస్తారని వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ కమలాకర్‌రెడ్డి, ఎంపీపీ శ్రీదేవి తెలిపారు. ఉదయం 9గంటలకు మండలంలోని కె.బాటవారిపల్లె ప్రభుత్వ జిల్లాపరిషత్ ఉన్నతపాఠశాల ఆవరణంలో నిర్వహించనున్న వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ చేస్తారన్నారు. అలాగే వలంటీర్లకు వందనం కార్యక్రమంలో పాల్గొని ఉత్తమ వలంటీర్లకు సన్మానించనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రజా సమస్యలు తెలుసుకుని పరిష్కరించడం జరుగుతుందన్నారు.

ప్రజల ఆరోగ్యంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ

ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి


బాధితులకు సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి

వాల్మీకిపురం: సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి ప్రజల ఆరోగ్యం పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నారని ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి అన్నారు. సోమవారం స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను పంపిణీ చేశారు. నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 14 మందికి సీఎం సహాయనిధి కింద మంజూరైన రూ.20,35,000కు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే చేతుల మీదుగా బాధిత కుటుంబాలకు అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ప్రజల సంక్షేమమే ధ్యేయంగా సీఎం వైఎస్ జగన్మోహన్ రెడ్డి నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. కష్టకాలంలో ఉన్న ప్రజలను ఆదుకుంటున్న ఘనత సీఎం జగన్‌కు దక్కుతుందన్నారు. కరోనా కష్టకాలంలో ప్రజలకు మెరుగైన వైద్య సేవలను అందించారన్నారు. వెయ్యి దాటితే ఆరోగ్యశ్రీ పథకం ద్వారా ఉచితంగా వైద్య సేవలను అందిస్తున్నారన్నారు. కార్యక్రమంలో ఉపసర్పంచ్ కేశవ రెడ్డి, నాయకులు బావాజీ, రిజ్వాన్, లక్ష్మినారాయణరెడ్డి, శివారెడ్డి, ప్రియరంజన్‌రెడ్డి, సురేష్ కుమార్ రెడ్డి, రెడ్డెప్ప రెడ్డి, గంగయ్య, మధు, కుమార్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నాణ్యమైన విద్య


మాట్లాడుతున్న ఎంఈఓ రెడ్డిబాషా

కేవీపల్లె : విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలని ఎంఈఓ పి.రెడ్డిబాషా అన్నారు. సోమవారం గ్యారంపల్లె ఏపీ గురుకుల పాఠశాలలో సీఆర్పీ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భౌతికంగా, మానసికంగా అభివృద్ధి చెందేవిధంగా ఉపాధ్యాయులు తోడ్పాటు నందించి విద్యార్థుల సమగ్రాభివృద్ధికి కృషి చేయాలన్నారు. ఉపాధ్యాయులు సమయపాలన పాటించాలని, విద్యార్థులకు మధ్యాహ్న భోజనం నాణ్యంగా ఉండేలా చూసుకోవాలని కోరారు. విద్యార్థులకు కనీస అభ్యసన సామర్థ్యాలు వచ్చే విధంగా ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేయాలన్నారు. విద్యార్థులకు ఆంగ్లబోధన పటిష్టంగా చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రిసోర్స్ పర్సన్స్ పచ్చార్ల సుధాకర్, చంద్రశేఖర్, ఉదయ్‌కిరణ్, చంద్రశేఖర్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సంచార జాతులను రాజకీయంగా గుర్తించాలి

కలికిరి: సంచార జాతులను రాజకీయంగా గుర్తించాలని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు గోరంట్ల శ్రీనివాసులు కోరారు. పట్టణంలోని ఆర్‌ఎస్‌ఆర్ కళ్యాణ మండపంలో సంచార జాతుల అభివృద్ధి మండలి ఆధ్వర్యంలో సంచార జాతుల హక్కుల సమాజ బేటీ కార్యక్రమం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం సంజార జాతుల జనాభాను తేల్చి, కార్పోరేషన్ నిధులను విడుదల చేయాలని డిమాండ్ చేశారు. జనాభా దామాషా ప్రకారం రాజకీయ పార్టీలు కనీసం ఒక ఎంపీ, ఎమ్మెల్యే సీటు ఇవ్వాలని కోరారు. తమ న్యాయపరమైన డిమాండ్‌లు పరిష్కరించిన రాజకీయ పార్టీకి తమ మద్దతు ఉంటుందని ప్రకటించారు. సంచార జాతుల వారు ఏకస్తులైతే తమ డిమాండ్‌లను తెచ్చుకోవచ్చున్నారు. అనంతరం ఆ సంఘం జిల్లా చైర్మెన్‌గా గోవిందు వెంకటరమణను, 12 మంది కార్యవర్గ సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో సంచార జాతుల సంఘం నేతలు కోట లక్ష్మీ, కటారి రవీంద్ర, సుబ్రమణ్యం, సంపంగి, రాజా, వెంకటరమణ తదితరులు పాల్గొన్నారు.

క్షయవ్యాధి రహిత గ్రామాల గుర్తింపు


రోగిని పరీక్షిస్తున్న డాక్టర్ చంద్రశేఖర్

పీలేరు : క్షయ వ్యాధి నివారణ పీలేరు యూనిట్ పరిధిలోని కేవీపల్లె, కలకడ, పీలేరు మండలాల్లో ఏడు గ్రామ పంచాయతీలు క్షయవ్యాధి రహిత గ్రామ పంచాయతీలుగా గుర్తించినట్లు పీలేరు ప్రభుత్వాస్పత్రి సూపరింటెండెంట్, టీబీ రహిత పంచాయతీల నిజ నిర్ధారణ కమిటీ ప్రత్యేక పరిశీలకులు డాక్టర్ చంద్రశేఖర్ తెలిపారు. సోమవారం గూడరేవుపల్లెలో డాక్టర్ మాట్లాడుతూ క్షయవ్యాధి అనుమానిత రోగిని సకాలంలో గుర్తించడం, రోగ నిర్ధారణ ద్వారా క్షయ రోగికి ప్రతిరోజు క్రమ తప్పకుండా మందులు ఇవ్వడం, పోషకాహారం సకాలంలో అందేటట్లు చూడడం, ప్రభుత్వ ప్రోత్సాహకాలు రూ. 3 వేలు అందించడం జరుగుతోందన్నారు. కార్యక్రమంలో డాక్టర్ చంద్రశేఖర్‌నాయక్, హెచ్‌ఈ కొండయ్య, పర్యవేక్షణాధికారులు మోహన్, పవన్, శ్రీనివాసులు, ఏఎన్‌ఎం పాముస్నిషా, సీహెచ్‌వో లావణ్య పాల్గొన్నారు.

జనాభా ప్రాతిపదికన రిజర్వేషన్లు కల్పించాలి

బీఎస్పీ ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

రాయచోటి అర్బన్ : జనాభా ప్రాతిపదికన బీసీలకు రిజర్వేషన్లను కల్పించాలని బీఎస్పీ రాయచోటి ఇన్‌చార్జ్ నాగార్జున, ప్రజా సంఘాల నేతలు ఈశ్వర్, రెడ్డెయ్య, నాగమునిలు డిమాండ్ చేశారు. స్థానిక అంబేడ్కర్ చిత్రపటం వద్ద సోమవారం మధ్యాహ్నం బీఎస్పీ ఆధ్వర్యంలో లక్ష సంతకాల సేకరణ కార్యక్రమం జరిగింది. నేతలు మాట్లాడుతూ రిజర్వేషన్‌ల అమలులో బీసీలకు అడుగడుగునా అన్యాయం జరుగుతోందన్నారు. 52 శాతం ఉన్న బీసీలకు న్యాయం జరగాలన్న డిమాండ్‌తో లక్ష సంతకాల సేకరణ కార్యక్రమాన్ని చేపట్టామన్నారు. జనాభాలో 52 శాతం ఉన్న బీసీలకు అన్ని రంగాలలో 52 శాతం రిజర్వేషన్‌లు కల్పించాలన్నారు. బీఎస్పీ రాయచోటి ఇన్‌చార్జ్ మాట్లాడుతూ సంతకాల సేకరణ పూర్తయిన తర్వాత ప్రతులను ఉమ్మడి రాష్ట్రాల బీఎస్పీ ఇన్‌చార్జ్ రాంజీ గౌతమ్‌కు అందజేస్తామన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నేత నిరంజన్, న్యాయవాదులు షరీఫ్, రాజ్‌కుమార్, రమణ, వడ్డెర విద్యావంతుల వేదిక మారుతిశంకర్, బంజారా సంఘం నేత శంకర్‌నాయక్, నేతలు చాట్ల వీరయ్య, నరసింహ, నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

హంద్రీ–నీవా కాలువ గట్టు ఆక్రమణపై ఫిర్యాదు


హెచ్‌ఎన్ఎస్ఎస్ సూపరింటెండెంట్ శ్రీధరరెడ్డికి ఫిర్యాదు చేస్తున్న మాలమహానాడు నాయకులు

మదనపల్లె : మండలంలోని కొత్తపల్లె పంచాయతీలో హంద్రీనీవా కాలువ గట్టుపైన కొందరు రియల్టర్లు అక్రమంగా తారురోడ్డు నిర్మాణం చేస్తున్నారని మాలమహానాడు జిల్లా ఉపాధ్యక్షులు గుండామనోహర్ సోమవారం హెచ్ఎన్ఎస్ఎస్ సూపరింటెండెంట్ శ్రీధర్‌రెడ్డికి ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... హంద్రీనీవా కాలువకు ఆనుకుని కొందరు రియల్ఎస్టేట్ వ్యాపారులు వెంచర్లు వేయడమే కాకుండా, లేఅవుట్‌లోకి వెళ్లేందుకు హంద్రీనీవా స్థలాన్ని వినియోగిస్తున్నారన్నారు. కాలువకు ఇరువైపులా ప్రభుత్వ స్థలం ఎంత ఉందనే విషయమై అధికారులు ఒకసారి క్షేత్రస్థాయి పరిశీలన చేస్తే బాగుంటుందని కోరారు. ప్రభుత్వ స్థలం సరిహద్దులు తెలిపేలా రాళ్లు ఏర్పాటుచేయాలన్నారు. హంద్రీనీవా కాలువ గట్టుపై తారురోడ్డు నిర్మాణం చేపట్టిన రియల్ ఎస్టేట్ వ్యాపారులపై కఠినచర్యలు తీసుకోవాలని కోరారు.

విశ్రాంతి గది నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న దాత నరసింహారెడ్డి

తంబళ్లపల్లె: మండలంలోని మల్లయ్యకొండపై వెలసిన శ్రీభ్రమరాంబిక సమేత మల్లికార్జునస్వామి ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం విశ్రాంతి గది నిర్మాణానికి సోమవారం భూమిపూజ చేశారు. ఎమ్మెల్యే పెద్దిరెడ్డి ద్వారకనాథరెడ్డి సూచనల మేరకు ఎద్దులవారిపల్లె పంచాయితీ గొడసానివారిపల్లెకు చెందిన వాటర్‌షెడ్ చైర్మన్ నరసింహారెడ్డి వెలుగు మల్లమ్మ ఆలయం పక్కన సొంత నిధులు సుమారు రూ.3 లక్షలతో గదిని నిర్మిస్తున్నారు. ఆయనను ఆలయ కమిటీ చైర్మన్‌మల్‌రెడ్డి, ధర్మకర్త ప్రభాకర్‌రెడ్డి అభినందించారు.

రైతుల సమస్యలు సత్వరమే పరిష్కరించండి


రైతుల సమస్యలపై మాట్లాడుతున్న సాయికిషోర్ రెడ్డి

ఓబులవారిపల్లె : స్పందన కార్యక్రమానికి మండల నలుమూలల నుంచి వచ్చే రైతుల సమస్యలు సత్వరమే పరిష్కరించాలని ఏపీటీడీసీ డైరెక్టర్ వత్తలూరు సాయికిషోర్ రెడ్డి పేర్కొన్నారు. సోమవారం స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో నిర్వహించిన స్పందన కార్యక్రమంలో వారు పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ సమస్యలపై తహసీల్దార్ శేషగిరి రావుకు రైతులు వినతిపత్రాలు అందజేశారు. అనంతరం సాయికిషోర్ రెడ్డి మాట్లాడుతూ ప్రధానంగా ఆన్‌లైన్‌లో సవరణలు, మార్పులు, చేర్పులు క్షేత్రస్థాయిలో పరిశీలించి వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్‌ను కోరారు. అదే విధంగా రేషన్ కార్డులు, ఆధార్ సమస్యలు వెంటనే పరిష్కరించాలని తహసీల్దార్‌తో అన్నారు. సర్వేకు సంబంధించి ప్రజలు, రైతులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలియజేశారు. ఇందుకు తహసీల్దార్ స్పందిస్తూ సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి సత్వరమే పరిష్కరిస్తామని అన్నారు. కార్యక్రమంలో నాయకులు తల్లెం రమణారెడ్డి, సర్పంచ్‌ల సంఘం అధ్యక్షులు పోలి పాపిరెడ్డి, సర్పంచ్‌లు జరుగు నారాయణ రెడ్డి, సరేంద్రరాజు, మాజీ ఎంపీపీ రామకృష్ణయ్య, ఎంపీటీసీలు పైడి గిరినాయుడు, దుర్గా ప్రసాద్, నరసింహ, కో–ఆప్షన్ మెంబర్ షేక్ మౌలానా, వైఎస్సార్ పార్టీ నాయకులు టంగుటూరు రాజశేఖర్ రెడ్డి, ఉమా శంకర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలి


మాట్లాడుతున్న ఎంవీఐ వినోద్‌కుమార్

రాజంపేట : ప్రతి ఒక్క వాహనదారుడు రోడ్డు భద్రతా నిబంధనలు పాటించాలని రాజంపేట ఎంవీఐ బి.వినోద్‌కుమార్ అన్నారు. సోమవారం అన్నమాచార్య ఫార్మసీ కళాశాలలో రోడ్డు భద్రతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యంగా యువత మొబైల్ ఫోన్ మాట్లాడుతూ బైకు, కారులు నడపరాదన్నారు. మద్యం సేవించి వాహనాల నడపడం వల్ల ప్రమాదాలకు గురయ్యే ప్రమాదం ఉందన్నారు. త్రిపుల్ రైడింగ్ చేయరాదన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణ చర్యలను అమలు చేయాల్సిందేనని చెప్పారు. డ్రైవింగ్ లైసెన్స్ తప్పనసరిగా ఉండాలన్నారు. డ్రైవింగ్ విషయంలో అవగాహన కొరవడి ప్రమాదాల బారీన పడుతున్నారన్నారు. ప్రభుత్వం రోడ్డు భద్రతా వారోత్సవాలను నిర్వహించి ప్రజలకు రహదారి భద్రతా నియమాలను తెలిజేస్తోందన్నారు. మోటారు వాహనాల చట్టం గురించి ప్రతి ఒక్కరూ తెలుసుకోవాలన్నారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఫార్మసీ కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా ఛత్రపతి శివాజీ జయంతి



పీలేరు: ఛత్రపతి శివాజీ చిత్రపటం వద్ద నివాళి, మదనపల్లె: ఛత్రపతి శివాజీ జయంతి నిర్వహిస్తున్న దృశ్యం

పీలేరు : ప్రజల కోసమే ప్రభువు అన్న సిద్ధాంతంతో పాటుపడ్డ ఛత్రపతి శివాజీ జయంతిని పీలేరులో ఘనంగా నిర్వహించారు. సోమవారం స్థానిక నాలుగురోడ్ల కూడలిలో ఛత్రపతి శివాజీ చిత్రపటానికి పూల మాలలతో నివాళులర్పించారు. కేక్‌కట్ చేసి పంచి పెట్టారు. ఛత్రపతి శివాజీ అభిమానులు శివగణేష్ సురేంద్ర మాట్లాడుతూ మరాఠా సామ్రాజ్యాన్ని విస్తరించిన యోధుడు ఛత్రపతి శివాజీ అని పేర్కొన్నారు. నిస్వార్థంగా ప్రజలకు సేవచేయడం, తాను చేస్తున్న పని పట్ల అంకిత భావం, మచ్చిలేని వ్యక్తిత్వం ఆయన అనుచరులకు, ప్రజలకు ఆదర్శంగా నిలిచాయని పేర్కొన్నారు. కార్యక్రమంలో రాజారావు, వివేక్, సాయి, వెంకటేశ్వర్‌రావు, దేవేంద్రరావు, రవీందర్‌రావు, రెడ్డిప్రసాద్, కోమల, కుసుమ తదితరులు పాల్గొన్నారు.

ఛత్రపతి శివాజీ జయంతి

మదనపల్లె : ఛత్రపతి శివాజీ మహారాజ్ జయంతి సందర్భంగా పట్టణంలోని మరాతా సంఘం ఆధ్వర్యంలో స్థానిక చిత్తూరుబస్టాండ్‌లో ప్రత్యేక కార్యక్రమం నిర్వహించారు. శివాజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. శివాజీ మహారాజ్‌కీ జై అంటూ నినాదాలు చేశారు. పట్టణంలోని మరాతా కులస్థులందరి కోరిక మేరకు చిత్తూరుబస్టాండ్‌లో శివాజీ విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ...మరాతా సామ్రాజ్యాన్ని నెలకొల్పి మచ్చలేని వ్యక్తిత్వంతో, మతసామరస్యంతో స్త్రీలను గౌరవించడం, ప్రజల కోసమే ప్రభువు అన్న సూత్రం పాటించిన సాహసి, సహనశీలి, వీరుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ అని కొనియాడారు.

సిద్దవటంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రం

సిద్దవటం : ఆర్‌బీఐ ఆదేశాల మేరకు వలంటరీ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సొసైటీ ఆధ్వర్యంలో ఆర్థిక అక్షరాస్యత కేంద్రాన్ని సిద్దవటంలో ప్రారంభించామని సిద్దవటం ఎస్‌బీఐ మేనేజర్ డేవిడ్‌రాజు, ఏపీజీబీ మేనేజర్ గంగాదేవిలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సిద్దవటం, రాజంపేట, చింతకొమ్మదిన్నె మండలాలకు సంబంధించి గ్రామీణ ప్రాంతాల్లో ఉన్నటువంటి ప్రజలకు ఆర్థిక పరమైనటువంటి అభివృద్ధి కోసం ప్రణాళిక క్రమములు తెలియజేస్తూ ఆర్థిక లావాదేవిలు జరుపుటకు ఆర్థిక క్రమశిక్షణ పెంపొందించుటకు ప్రభుత్వం రంగ బ్యాంకులు ఎంతగానో తోడ్పతున్నాయన్నారు. బ్యాంకులు మెరుగైన సేవలు అందిస్తున్నాయన్నారు. ఈ బ్యాంకుల సేవల ద్వారా ప్రజలకు ఆర్థిక లావాదేవిలు మెరుగుపరుచుటకు బ్యాంకుల ద్వారా ఆర్థిక అక్షరాస్యత కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ అవకాశాన్ని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని వారు తెలియజేశారు.

సర్వీసు రోడ్డు నిర్మించాలని వినతి


సర్వీస్ రోడ్డు నిర్మించాలని చైర్‌పర్సన్ మనూజారెడ్డికి వివరిస్తున్న కాలనీవాసులు

మదనపల్లె : అనంతపురం-మదనపల్లె జాతీయరహదారిపై అమ్మచెరువుమిట్ట వద్ద జరుగుతున్న నేషనల్ హైవే నిర్మాణంలో భాగంగా స్థానికులకు సౌకర్యంగా సర్వీసు రోడ్డు నిర్మించేలా చర్యలు తీసుకోవాలని కాలనీవాసులు చైర్‌పర్సన్ మనూజారెడ్డికి విన్నవించారు. సోమవారం జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో భాగంగా చైర్‌పర్సన్‌ను కలిసిన మహిళలు 1వవార్డు అమ్మచెరువుమిట్ట రంగనాథ పెట్రోల్‌బంక్ ఎదురుగా హైవేనిర్మాణానికి సంబంధించి స్థలసేకరణ జరిపి రోడ్డు నిర్మాణం చేశారన్నారు. దీంతో తమ కాలనీలు ఎక్కువ ఎత్తులోకి వెళ్లాయన్నారు. వాహనాలు నడపాలంటే నేరుగా హైవేలోకి వచ్చేలా ఉంటోందని, ఇదిలాగే వదిలేస్తే, భవిష్యత్తులో ప్రమాదాలు జరిగే అవకాశం ఉందన్నారు. మున్సిపల్, హైవే అధికారులు చొరవ తీసుకుని, సర్వీసురోడ్డు నిర్మాణం చేస్తే తమకు సౌకర్యంగా ఉంటుందని వినతిచేశారు. అలాగే ఏప్రిల్ 14న అంబేద్కర్ 133వ జయంతి సందర్భంగా ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని అంబేడ్కర్ విగ్రహానికి, చుట్టూ ఉన్న గ్రిల్స్‌కు రంగులు వేయించి, తెగిపోయిన విద్యుత్ వైర్లను సరిచేసి, పూలమొక్కలు నాటాలని అంబేద్కర్ కమిటీ సభ్యులు వినతిచేశారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్ మనూజారెడ్డి మాట్లాడుతూ....జగనన్నకు చెబుదాంలో వచ్చిన సమస్యలను తక్షణమే పరిష్కరించేందుకు మున్సిపల్ అధికారులు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన


ప్రకృతి వ్యవసాయాన్ని పరిశీలిస్తున్న సారా రోవర్స్

వాల్మీకిపురం: ప్రకృతి వ్యవసాయం, రసాయన వ్యవసాయాలపై తేడాను తెలుసుకొని ప్రకృతి పద్ధతిలో వ్యవసాయాన్ని పండించేందుకు ఇటలీ నుంచి సారా రోవర్స్ పంట పొలాలను పరిశీలించారు. సోమవారం మండలంలోని అయ్యవారిపల్లిలో నిర్వహిస్తున్న సేంద్రియ పంటల సాగును జిల్లా ప్రాజెక్టు మేనేజర్ రామకృష్ణరాజు, రైతు సాధికార సంస్థ రాష్ట్ర స్థాయి అధికారి సురేంద్ర రెడ్డి ఆధ్వర్యంలో ఇటలీ నుంచి వచ్చిన సారా రోవర్స్‌కి వివరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఏపీసీఎన్ఎఫ్ ప్రాజెక్టు ద్వారా అమలవుతున్న ప్రకృతి వ్యవసాయ కార్యక్రమాలను అర్థం చేసుకోవడం కోసం ఆమె ఇక్కడ పరిశీలించారన్నారు. సేంద్రియ వ్యవసాయం ద్వారా పండించిన ఆహార ఉత్పత్తులను వినియోగించాలన్నారు. అయ్యవారిపల్లిలో ప్రకృతి వ్యవసాయంలో సార్వత్రిక సూత్రాల చక్రం, బీజామృతం, ఘన జీవామృతం, ద్రవ జీవామృతం, విత్తన గుళికల తయారీ అంశాలపై డెమో చేసి అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి వ్యవసాయ సిబ్బంది స్వాతి, పవన్, చందు, రైతులు, మహిళలు పాల్గొన్నారు.

ముగిసిన వెంకటరమణుడి బ్రహ్మోత్సవాలు


పుష్పయాగం నిర్వహిస్తున్న వేదపండితులు

తంబళ్లపల్లె: మండలంలోని కోసువారిపల్లెలో గల శ్రీప్రసన్న వెంకటరమణస్వామి ఆలయంలో 11 రోజులుగా చేపట్టిన స్వామివారి వార్షిక బ్రహ్మోత్సవాలు సోమవారం ముగిశాయి. టీటీడీ ఆధ్వర్యంలో ఉపప్రధాన అర్చకులు కృష్ణప్రసాద్‌బట్టార్, అర్చకులు రమేష్‌బాబులు ఉదయం స్వామివారి ప్రత్యేక అలంకరణ చేసి స్నపన తిరుమంజనం నిర్వహించారు. రాత్రి పలు రకాల పుష్పాలతో స్వామికి నిర్వహించిన పుష్పయాగం కార్యక్రమం భక్తులు తిలకించి పరవశించారు. ప్రత్యేక పూజలు, అభిషేకాలతో భక్తులకు స్వామివారి దర్శనం కల్పించి తీర్థప్రసాదాలు అందజేశారు. టీటీడీ డిప్యూటీ ఈవో వరలక్ష్మి, ఆలయ ఇన్స్‌పెక్టర్ డిశంత్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉన్నత శిఖరాలకు..


మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీదేవి

కలకడ : విద్యార్థులు కష్టడి కాకుండా ఇష్టపడి చదివితే ఉన్నతశిఖరాలు అధిరోహించడం చాలా సులువు అని ఎంపీపీ శ్రీదేవి అన్నారు. సోమవారం మండలంలోని కలకడ కస్తూరిబాగాంధీ బాలికల గురుకుల పాఠశాలలో నిర్వహించిన 10వతరగతి విద్యార్థులకు వీడ్కోలు సమావేశం నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ పాల్గొని ప్రసంగించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విద్య, వైద్య రంగాలను రెండు కళ్లుగా భావించి విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చారన్నారు. ప్రభుత్వ బడులను దేశంలో ఎక్కడా లేనివిధంగా ఆధునికీకరించి ఉచిత విద్యను కార్పోరేట్ స్థాయిలో అందిస్తున్నారన్నారు. ప్రతి విద్యార్థి వందశాతం ఉత్తీర్ణతతో మంచి పేరు తీసుకురావాలని కోరారు. కార్యక్రమంలో ఎంఈఓ మునీంద్రనాయక్, ప్రిన్సిపాల్ అనిత, ఉపాధ్యాయులు రాధ, సైపుద్దీన్ పాల్గొన్నారు.